ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

మంగళవారం 20 మే 2025

నెరవేరనున్న పేదల సొంతింటి కల

పేదల సొంతింటి కల నెరవేరనుంది. ఇళ్లు లేని పేదలు కూడా కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. దీనికి అనుగుణంగానే ప్రభుత్వం కూడా అడుగులు వేస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం తన వాటా పెంచుతూ ప్రకటించగా.. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్మాణానికి తన వంతు సాయం అందిస్తామని ప్రకటించింది. దీంతో జిల్లాలో పెద్దఎత్తున ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు వచ్చాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



- కొత్త ప్రభుత్వంపై నమ్మకంతో ఇళ్ల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు
- యూనిట్ కాస్ట్ కూడా పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఇప్పటికే 42వేల మంది లబ్ధిదారుల ఎదురుచూపులు
- కొత్త రేషన్‌కార్డులిచ్చాక మరో 20వేల దరఖాస్తులొచ్చే అవకాశం

కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో 42,347 మంది తనకు సొంతంగా స్థలముందని, కొత్తగా పక్కా గృహాన్ని మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 22,534, అంటే 53.21 శాతం దరఖాస్తుల్ని తహసీల్దార్ ఆధ్వర్యంలో ఆమోదించారు. ఇంటి నిర్మాణం కోసం ఆయా స్థలాలకు అనుమతులిచ్చారు. ఇంకా 19,813 దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఆమోదించిన దరఖాస్తులను హౌసింగ్ అధికారులు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేస్తున్నారు. అక్కడి నుంచి అప్రూవల్ వచ్చాక నిర్మాణాలు ప్రారంభించుకోవచ్చు.

గత లబ్ధిదారులకూ అవకాశం..?

ఇంటి పట్టాలు ఊర్లకు దూరంగా ఉండడం, యూనిట్ కాస్ట్ సరిపోకపోవడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపించడం లేదని అప్పట్లో అధికారులు బలవంతంగా గ్రౌండింగ్ చేయించారు. దీంతో లబ్ధిదారులు కూడా చాలావరకు పునాదులు తవ్వేసి వదిలేశారు. 73,584 గృహాల్లో 50 శాతమే స్లాబ్ వరకు వెళ్లాయి. మిగిలినవి ఆయా దశల్లో ఆగిపోయాయి. ఇలా మన జిల్లాలో సుమారు 9వేల మంది పునాదులు నిర్మించుకుని వదిలేశారు. వారందరికీ పీఎం ఆవాస్ యోజన 2.0 కింద అవకాశం ఇచ్చేందుకు పైస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయంగా మరో రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవచ్చు.

రేషన్‌కార్డులు కొత్తవి వచ్చాక..

ప్రస్తుతం ప్రభుత్వం రేషన్‌కార్డుల్లో మార్పుచేర్పులు, కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ అవకాశం కోసం ఏళ్లుగా వేచి ప్రజలు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రస్తుతం 42 వేల మంది ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే.. కొత్త రేషన్‌కార్డులు వచ్చాక మరో 20 వేల మంది నుంచి దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

వైసీపీ హయాంలో జరిగిందిదీ..

వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదట్లో జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 73,584 గృహాలను మంజూరు చేసింది. ఒక్కో గృహానికి కేంద్రమే రూ.1.50 లక్షల సాయం అందించింది. ఈ సాయం 2014-19 మధ్య టీడీపీ హయంలో రూ.2.50 లక్షలుగా ఉండేది. అప్పుడు కూడా కేంద్రం రూ.1.50 లక్షలే ఇచ్చినా, రాష్ట్రం తన వాటా కింద మరో రూ.లక్ష ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన రూ.1.50 లక్షల తోనే సరిపెట్టింది. ఆయా ప్రాంతాలకు జగనన్న కాలనీలని పేరు కూడా పెట్టుకుంది. దీంతోపాటు ఇచ్చిన పట్టాలు ఊరికి దూరంగా కొండల్లో, గుట్టల్లో ఉండడం మరో ప్రధాన కారణం. దీంతో చాలా మంది ఇళ్లను నిర్మించుకోవడానికి ఆసక్తి చూపించ లేదు.



రామకుప్పం- ఆవులకుప్పం మధ్యనున్న పిల్లిగుట్టల్ని చదును చేసి ఇచ్చిన స్థలాల్లో ఒక్క ఇళ్లూ నిర్మించని లబ్ధిదారులు

నిర్మాణ వ్యయం భారీగా పెంపు

గతంలో పీఎం ఆవాస్ యోజన 1.0 అమలైతే.. తాజాగా 2.0ను అమలు చేస్తున్నారు. ఇందులో కేంద్రం తన వాటాను రూ.1.50 లక్షల నుంచి రూ.2.35 లక్షల వరకు పెంచుతున్నట్లు పేర్కొంది. అలాగే. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.లక్ష వాటా వేస్తున్నట్లు సీఎం చంద్రబాబు కూడా ప్రకటించారు. ఈ ప్రకటనలు ఉత్తర్వుల రూపంలో అమల్లోకి వస్తే ఒక్కో లబ్ధిదారుడికి రూ.3.35 లక్షల వరకు సాయం చేకూరుతుంది. ఈ సాయం మరింత పెరిగే అవకాశాలూ ఉన్నాయి. 2.0లో లబ్ధిదారులు యూనిట్ కాస్ట్‌కు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు అదనంగా ఖర్చు చేసుకుంటే సొంతింటి కల సాకారమవుతుంది.

రేపు కుప్పానికి చంద్రబాబు

- గంగమాంబను దర్శించుకోనున్న సీఎం
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీ

కుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఖరారైంది. కుప్పంలో జరుగుతున్న ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న విశ్వరూప దర్శనానికి సీఎం హాజరు కానున్నారు. అమ్మవారిని దర్శించుకుని.. పట్టు వస్త్రాలు సమర్పిస్తారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీగా ఉంది. ఈ ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ పరిశీలించారు. అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైనింగ్‌లో భాగంగా గుడుపల్లె మండల పరిధిలోని ద్రావిడ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ భద్రతా ఏర్పాట్లపై అధికారులు చర్చించారు. అనంతరం కుప్పం పట్టణంలోని గంగమాంబ ఆలయంవద్ద ఏర్పాట్లను పర్యవేక్షించి.. సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాలకమండలి సభ్యుడు వైద్యం శాంతారాం, ఏఎస్పీ నందకిషోర్, డీఎస్పీ పార్థసారథి, పీఆర్ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డిస్ట్రిక్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు, ఏఆర్ డీఎస్పీ పి.మహబూబ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గంగమాంబ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, కలెక్టర్, ఎస్పీ తదితరులు

పర్యటన వివరాలిలా..

సీఎం బుధవారం ఉదయం 10.50 గంటలకు విజయవాడనుంచి విమానంలో బయల్దేరి 11.50కి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని హెలిప్యాడ్‌లో దిగుతారు. తర్వాత రోడ్డు మార్గాన 12.50 గంటలకు గంగమాంబ ఆలయం చేరుకుని అమ్మవారి విశ్వరూపాన్ని దర్శించుకుని ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, సారె సమర్పిస్తారు. ఆలయంనుంచి 1.30 గంటలకు బయల్దేరి హెలిప్యాడ్‌కు వెళ్తారు. ఇక్కడ కొద్దిసేపు గడుపుతారు. 2.30 గంటలకు బయల్దేరి మూడు గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి సాయంత్రం 4గంటలకు బయల్దేరి 5.05 గంటలకు విజయవాడ చేరుకుంటారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, మే 19 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం జిల్లాలోని 36 కేంద్రాల్లో ప్రశాంతంగా మొదలైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. 2410 మంది విద్యార్థులకు గాను 1877 మంది హాజరు కాగా, 533 మంది గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. జనరల్ టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన తెలుగు సబ్జెక్టుకు 1859 మంది విద్యార్థులకు గాను 1443 మంది హాజరు కాగా, 416 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులకు హిందీ పరీక్షకు 45 మంది విద్యార్థులకు గాను 33 మంది హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్ సప్లిమెంటరీ ఇంగ్లీషు పరీక్షకు 506 మందికి గాను 401 మంది హాజరు కాగా, 105 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్, ఏడీ-2 వెంకటేశ్వరావు మూడు పరీక్షా కేంద్రాలను పరిశీలించగా, 8 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 31 కేంద్రాలను పరిశీలించినట్లు డీఈవో పేర్కొన్నారు. తొలి రోజు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.



లిటిల్ ఫ్లవర్ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్

చిత్తూరు సెంట్రల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మా కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈఏపీసెట్-2005) ప్రశాంతంగా జరిగింది. 874 మంది విద్యార్థులకు 798 మంది హాజరవగా, 76 మంది గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లో 437 మందికి 398 మంది, రెండో సెషన్‌లో 437 మందికి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు.



మళ్లీ 'ఎన్టీఆర్ బేబీ కిట్'

- పథకం పునరుద్ధరణకు ప్రభుత్వ ఆదేశాలు

వెదురుకుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం పునరుద్ధరణకు ప్రభుత్వం సోమవారం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ప్రత్యేక ప్రధాన కార్యదర్శి) ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కిట్టును రూ.1410 వ్యయంతో ఇవ్వనుంది. 2016లో ఈ పథకాన్ని ప్రారంభించగా, 2019లో వైసీపీ వచ్చాక ఆపేశారు. తాజాగా మళ్లీ ఈ పథకం కింద ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించే తల్లులకు లబ్ధి చేకూరుస్తారు. ఈ కిట్‌లో 11 రకాల సామగ్రి ఉంటుంది. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించిన తల్లులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో అందజేస్తారు. ఈ పథకం పునరుద్ధరించడంపై ఇది మంచి ప్రభుత్వం అంటూ పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కిట్‌లో ఉండే వస్తువులివే..

బేబీ కిట్‌లో దోమల రక్షణ వల, బేబీ మాకింతోష్, బేబీ డ్రెస్, బేబీ టవల్స్, బేబీ నేపీ (ఉతికి లేక కడిగి శుభ్రం చేయదగింది), బేబీ పౌడర్ 200 గ్రాములు (జాన్సన్), బేబీ షాంపు 100 మి.లీ(జాన్సన్), బేబీ ఆయిల్ 200 మి.లీ(జాన్సన్), బేబీ సోప్(జాన్సన్), బేబీ సోప్ బాక్స్, బేబీ రాటిల్ టాయ్ ఇందులో ఉంటాయి.

'ఆడుదాం ఆంధ్ర' అవినీతిపై విజిలెన్స్

రోజా ఇలాకాపై ప్రత్యేక దృష్టి

తిరుపతి (నేరవిభాగం) మే 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి ఆర్కే రోజా సారథ్యంలో జరిగిన 'ఆడుదాం.. ఆంధ్ర' క్రీడల కార్యక్రమాల్లో జరిగిన అవినీతి తీగ లాగుతున్నారు. తిరుపతి జిల్లాలో ముఖ్యంగా రోజా ప్రాతినిధ్యం వహించిన నగరి నియోజకవర్గంలో చోటుచేసుకున్న అవకతవకల చిట్టాను సేకరించే పనికి తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్ అధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. 2023-24 సంవత్సరంలో హడావుడిగా ప్రారంభించిన 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నిధులు జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధుల్లో గోల్‌మాల్ జరిగిందంటూ అనేక ప్రాంతాల నుంచీ విజిలెన్సు డీజీ భరీష్‌కుమార్ గుప్తాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు. దీంతో విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నుంచి అవసరమైన రికార్డులు తెప్పించి పరిశీలించారు. జిల్లాలో ఆట స్థలాలే లేని చోట్ల కూడా ఆటలు జరిగినట్లుగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నగరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు రావడంతో విజిలెన్సు డీఎస్పీ మల్లికార్జున రావు, సీఐ చంద్రశేఖర నాయక్, సిబ్బంది విచారణ చేస్తున్నారు. మరో మూడ్రోజులపాటు ఇది కొనసాగనుంది. జిల్లాకు 'ఆడుదాం-ఆంధ్ర' కింద నిధులు ఎంత వచ్చాయి? ఎంత ఖర్చు చేశారు? ఆటలకు సంబంధించి ఎన్ని కిట్లు కొనుగోలు చేశారు? వీటిని ఎక్కడ నుంచి తెప్పించారు? వాటి నాణ్యత ఏమిటి.. వంటి వివరాలను ఆరా తీస్తున్నారు. దీంతో పాటు క్రీడాకారులకు భోజన సదుపాయాలు, తదితర విషయాల మీద కూడా వివరాలు సేకరిస్తున్నారు.



పలమనేరు మండలంలో కలుజు పారుతున్న పెద్దపల్లె చెరువు

నేడు, రేపు భారీ వర్షాలు!

చిత్తూరు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా రూపాంతరం చెందుతోంది. ఈకారణంగా జిల్లాలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన 24 గంటల్లో జిల్లాలోని 22 మండలాల్లో తేలికపాటి నుంచి భారీవర్షాలు కురిశాయి. అత్యధికంగా గంగవరం మండలంలో 71.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. పలమనేరులో 70.2, రామకుప్పంలో 58.6, బైరెడ్డిపల్లెలో 41.2, గుడుపల్లెలో 36.4, కుప్పంలో 35.2, శాంతిపురంలో 32.6, పెద్దపంజాణిలో 30.2, పాలసముద్రంలో 25.2, నగరిలో 21.2, పుంగనూరులో 8.2, నింద్రలో 7.2, సోమల, వి.కోటలో 6.8, శ్రీరంగరాజపురం, రొంపిచెర్లలో 6.2, పులిచెర్ల, తవణంపల్లెలో 2, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో 1.2, చౌడేపల్లె, గుడిపాల మండలాల్లో ఒక మి.మీ వర్షం కురిసింది.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

కుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర వైభవంగా జరుగుతోంది. సోమవారం రాత్రి ముత్తుమారెమ్మ అగ్నిగుండ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయంలో సర్వాంగ సుందరంగా ఆభరణాలు, పూలమాలలతో అలంకరించిన ముత్తుమారెమ్మకు పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని అగ్నిగుండ ప్రదేశానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారి కంకణాలు ధరించి దీక్షలో ఉన్న భక్తులు, పవిత్ర స్నానాలు ఆచరించారు. గెరిగ పట్టుకున్న పూజారి తొలుత అగ్నిగుండంలో పాదం మోపారు. ఆయన వెంట ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం చేసింది. గంగమ్మా.. మాయమ్మా.. అన్న భక్తుల నినాదాలతో, డప్పుల మోతలతో పరిసరాలు ఒక్కసారిగా మార్మోగాయి. కుప్పమే కాక మూడు రాష్ట్రాలనుంచి తరలివచ్చిన భక్తజనంతో పట్టణం జనసంద్రమైంది. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు ఉదయం గంగమ్మ శిలా విగ్రహానికి క్షీరాభిషేకం. గంధాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జాతర ఉత్సవ కమిటీ ప్రథమ సభ్యుడు బీఎంకే.రవిచంద్రబాబు, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మ శిలావిగ్రహానికి పూజలు



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో)అమ్మవారు



విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపుతున్న సిబ్బంది

ఏపీఈఏపీ సెట్ ప్రారంభం

● హాజరైన 2,277 మంది విద్యార్థులు

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశానికి సంబంధించిన పరీక్షలు తిరుపతిలో 5, గూడూరు 4, పుత్తూరులో 2 మొత్తం 11 కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 2,458 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,277 మంది రాశారు. 181 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు పరీక్షలు జరుగుతాయి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

షార్‌లో ప్రారంభమైన యువికా

ఇస్రో నిర్వహించే యువికా-2025 (యువ విజ్ఞాన కార్యక్రమం) శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర షార్‌లో సోమవారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అన్ని ఇస్రో సెంటర్లలో ఈనెల 30 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. యువికాకు ఎంపికైన 50మంది విద్యార్థులు షార్‌కు విచ్చేశారు. వీరికి ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల రూపకల్పన, అంతరిక్ష పరిశోధనలపై శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. రాకెట్ ప్రయోగ వేదిక, స్పేస్ మ్యూజియాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,571

తలనీలాలు సమర్పించినవారు: 33,372



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వర్షంలోనూ తరలివచ్చారు

● పీజీఆర్ఎస్‌కు 257 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), మే 19(ఆంధ్రజ్యోతి): వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 257 అర్జీలు అందగా అందులో 155 రెవెన్యూ శాఖకు చెందినవే. అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.

పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి



రేణిగుంట మండలం మామండూరులో ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయి. పంట పొలాలపై దాడులు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అటవీ శాఖ ఏర్పాటు చేసిన కందకాలు పూడిపోవడంతో మామిడి తోటల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- చిట్టెమ్మ, మామండూరు, రేణిగుంట మండలం

జేమ్స్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, సుమన్, వెంకటేష్ కోరారు. ఈ మేరకు అధికారులకు విన్నవించారు.

పనిచేయని లిఫ్టు :వారం రోజులుగా కలెక్టరేట్‌లో లిఫ్టు మొరాయిస్తూనే ఉంది. దీంతో అటు అర్జీదారులు, ఇటు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లిఫ్టు పనిచేయకపోవడంతో సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చిన వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు అవస్థలు పడ్డారు.

రుయాలో చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), మే 19 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో మలబద్ధకంతో బాధపడుతున్న రెండేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స చేసి పరిష్కరించామని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ సోమవారం మీడియాకు తెలిపారు. కర్నూలు జిల్లా ఒలిచాడుకు చెందిన శ్రావణి, గిరిరాజుల కుమార్తెకు ఎనీమ ఇస్తే తప్ప మలవిసర్జనకు వెళ్లలేని పరిస్థితిలో పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇటీవల రుయాస్పత్రికి తీసుకురాగా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు జగదీష్ పరీక్షించి పెద్దపేగు నాడీ వ్యవస్థకు సంబంధించి లాంగ్ సెగ్మెంట్ హిర్ష్‌పురంగ్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారన్నారు. మూడు దశల్లో క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి సమస్యను పరిష్కరించారన్నారు. సోమవారం చిన్నారిని డిశ్చార్జి చేశామన్నారు. ఈ వైద్య బృందాన్ని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, సూపరింటెండెంట్ రాధ అభినందించారు. ఏఆర్ఎంవో హరికృష్ణ, డాక్టరు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి సిందూర్‌తో సమాధానం

● త్రిపుర మాజీ సీఎం బిప్లవ్ కుమార్‌దేవ్



సమావేశంలో మాట్లాడుతున్న బిప్లవ్ కుమార్‌దేవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 19(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి బదులుగా చేపట్టిన ఆపరేష్ సిందూర్ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక అని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బిప్లవ్ కుమార్‌దేవ్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన నగరంలో సోమవారం జరిగిన ఆపరేషన్ సిందూర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ముందుగా అమరవీరుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సిందూర్ ద్వారా మన సైనిక బలాన్ని ప్రపంచానికి చూపించామన్నారు. చైనా రాడార్ వ్యవస్థకూ అంతుచిక్కకుండా పాక్‌పై దాడులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా ఇంచార్జి రాటకొండ విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్, డాక్టర్ నరేష్, మల్లకుప్ప శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోగుల కోసం 'స్విమ్స్ సేవ'



స్విమ్స్ సేవ సహాయకులతో కరచాలనం చేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), మే 19(ఆంధ్రజ్యోతి): టీటీడీలో శ్రీవారి సేవ మాదిరిగా.. రోగుల సహాయం కోసం స్విమ్స్ సేవను సోమవారం ప్రారంభించినట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. టీటీడీ ఛైర్మన్, ఈవో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 42 విభాగాల పరిధిలో రోజుకు 20 మంది చొప్పున స్విమ్స్ విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా ఈ సేవకు నియమించామన్నారు. ఓపీ సమయంలో వీరు రోగులకు సాయం చేస్తారన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, ఫిజియో థెరపీ కళాశాల ప్రిన్సిపల్ మాధవి, వైద్యాధికారులు వివేకానంద్, మురళీ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సార్.. ఆదుకోండి

● పక్షవాతంతో బాధపడుతున్న కానిస్టేబుల్ వేడుకోలు

● మానవత్వం చూపిన ఎస్పీ

● పోలీస్ పీజీఆర్ఎస్‌కు 67 వినతులు



పక్షవాతంతో బాధ పడుతున్న రిజర్వు కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రిజర్వు విభాగంలోని కానిస్టేబుల్ శివకుమార్ కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధ పడుతున్నారు. నడవలేక.. సరిగా మాట్లాడలేక.. నిలబడలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో తనను ఆదుకోవాలని కోరుతూ సోమవారం కుమారుడు, భార్యతో కలసి ఎస్పీ కార్యాలయానికి వచ్చారాయన. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. ఆయన బాధ, విధులు నిర్వహించడానికి పడుతున్న కష్టాలను ఎస్పీకి వివరించారు. దాదాపు అరగంట పాటు ఆయనతో హర్షవర్ధన్‌రాజు మాట్లాడి బాధలు తెలుసుకున్నారు. పరిపాలనాధికారిని పిలిపించి తక్షణం ఆయనకు అవసరమైన ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తనపట్ల ఎస్పీ చూపిన ఆదరణకు రిజర్వు కానిస్టేబుల్ శివకుమార్ కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు.

కేవీబీపురం ఘటనపై విచారణకు ఆదేశం

ఇటీవల కేవీబీపురంలో చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు స్థానిక నాయకుల ప్రమేయంతో పోలీసులు బాధితులపైనే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారని బాధిత మహిళలు కొందరు ఎస్పీని కలిసి వివరించారు. దీనిపై విచారించి సమగ్ర నివేదిక అందచేయాలని పుత్తూరు డీఎస్పీ రవికుమార్‌ను ఎస్పీ ఆదేశించారు.

సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి

పోలీసు పీజీఆర్ఎస్‌కు వచ్చిన 67 ఫిర్యాదులను పరిశీలించిన పోలీసు అధికారులు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సమస్యలు పరిష్కారంలో పోలీసు అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, సీఐలు సాధిక్ ఆలీ, జయచంద్ర, కేవీఎస్ నాయుడు, ఇమ్రాన్‌భాషా, జయచంద్ర, శ్రీరాములు, రామయ్య, తిమ్మయ్య, బాబీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కొందరు కానిస్టేబుళ్లు తమకున్న ఇబ్బందులు చెప్పి అనుకూల ప్రాంతానికి బదిలీ చేసి ఆదుకోవాలనే విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

గిరిజన బాలుడి అదృశ్యం

● యజమానిపై తల్లి ఫిర్యాదు



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, మే 19 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చేవరకు కుమారుడిని బాతులు మేపేందుకు వదిలిపెట్టి వెళ్లారా గిరిజన మహిళ. ఇప్పుడొచ్చి అడిగితే యజమాని నుంచి సరైన సమాధానం రాలేదు. బాలుడు కనిపించకుండా పోయాడని, వెతుకుతున్నామంటూ చెబుతున్నాడు. దీంతో ఆ తల్లి సత్యవేడు పోలీసులను ఆశ్రయించారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కథనం మేరకు.. గూడూరు మండలం చవటపాళేనికి చెందిన అంకమ్మ తన భర్త చెంచయ్యను వదిలేశారు. అదే గ్రామానికి చెందిన ప్రకాష్‌తో కలిసి తన ముగ్గురు పిల్లలను తీసుకుని సత్యవేడు పట్టణంలోని దళవాయి అగ్రహారానికి చెందిన ముత్తు వద్ద బాతులు మేపుతూ రెండేళ్లుగా జీవనం గడుపుతున్నారు. పది నెలల కిందట తన భర్త చెంచయ్య మృతి చెందడంతో గ్రామానికి బయలుదేరుతున్న ఆమెను ముత్తు అడ్డుకుని, తన బాకీ ఇచ్చి వెళ్లాలని చెప్పారు. దీంతో ఆమె కుమారుడు వెంకటేష్(9)ను ఇక్కడే వదిలి.. బాకీ చెల్లించి తీసుకెళతానని చెప్పి వెళ్లారామె. అప్పట్నుంచి వెంకటేష్ తన తల్లితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతుండే వాడు. ఇటీవల నెల రోజులుగా పిల్లాడు ఫోన్ చేయడం లేదని ఆందోళన చెందిన అంకమ్మ.. వారం కిందట సత్యవేడుకు వచ్చి ముత్తు వద్ద తన కుమారుడి గురించి అడిగారు. తమిళనాడు రాష్ట్రం కంచి పరిసరాల్లో బాతులు మేపేందుకు వెళ్లగా తప్పిపోయాడని వెతికి తీసుకొస్తామని, కొంత గడువు ఇవ్వాలని అతడు అడిగారు. మళ్లీ రెండు రోజుల క్రితం ఆమె సత్యవేడుకు వచ్చి.. బాకీ మొత్తం చెల్లించేస్తానని, తన కుమారుడిని ఇవ్వాలని కోరారు. ఇంకా పిల్లాడు దొరకలేదని, తాము వెతికే పనిలోనే ఉన్నామని ముత్తు చెప్పారు. దీనిపై ఆమె గట్టిగా తన కుమారుడు కావాలని పట్టుబట్టారు. దీంతో ముత్తు, అతడి భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్ కలిసి అంకమ్మను కులం పేరుతో దూషించి బయటకు గెంటేశారు. దీంతో ఆమె సత్యవేడు పోలీసులకు సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సత్యవేడుకు చేరుకుని విచారించారు. ముత్తు, ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. సీఐ మురళి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. కాగా, పిల్లాడికి ఏమైనా జరిగిందా? తప్పిపోయినట్లు నమ్మిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయ నాయకులు

21న డీఈవో కార్యాలయం ముట్టడి

తిరుపతి(విద్య), మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీ నిబంధనలను సవరించాలని కోరుతూ ఈనెల 21న చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తెలిపింది. ఈ మేరకు సోమవారం తిరుపతిలోని యూటీఎఫ్ భవనంలో సమావేశమై నిర్ణయించారు. ఐక్యవేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ ముత్యాలరెడ్డి, జగన్నాథం, సురేష్, సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. బదిలీలకు సంబంధించి తమ ప్రతిపాదలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. 117 జీవో రద్దు పేరుతో గతంలో 6 విభాగాలుగా ఉన్న పాఠశాలలను 9 విభాగాలుగా మార్చి చేతులు దులుపుకోవడం ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యం కాదన్నారు. 3,4,5 తరగతులను మోడల్‌స్కూల్ పేరుతో తరలించడంవల్ల చాలావరకు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి చిన్నారులు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి మోడల్ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి స్పందన లభించనందున చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేయనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, వయ్యాల మధు, సుభాష్ చంద్రదాస్, వెంకటరమణ, రెడ్డి శేఖర్, మోహన్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అతివలకు భరోసా వన్‌స్టాప్ సెంటర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 19(ఆంధ్రజ్యోతి): మిషన్ శక్తి వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు భరోసా అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మిషన్‌శక్తి వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతిలోని మెటర్నటీ ఆస్పత్రిలో ఇప్పటికే మిషన్‌శక్తి వన్‌స్టాప్ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురైనప్పుడు తక్షణం ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి, సుజాత పాల్గొన్నారు.

మనమిత్ర సేవలు స్టాండ్ల అందజేత

వాట్సప్ మనమిత్ర ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అనే స్టాండ్స్‌ను సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి నారాయణరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమలకు సహకరించండి

మామిడి ఫ్యాక్టరీ యజమానులకు సహాయ సహకారాలు అందించాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన వర్చువల్ విధానం ద్వారా బ్యాంకు అధికారులతో సమీక్షించారు. మ్యాంగో పల్ప్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో రెండేళ్లుగా జ్యూస్ అమ్ముడుపోక చాలా వరకు నిల్వ ఉన్నాయన్నారు. బ్యాంకులకు వారు కట్టాల్సిన వడ్డీని ఆరు మాసాలు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు రవి కుమార్ పాల్గొన్నారు.



పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ



జస్టిస్ దుర్గాప్రసాద్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ కన్సిస్టింగ్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భువనేశ్వర్ కలిత, సభ్యులు, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, అలాటి నటి జయచిత్ర, నటి అమరెడ్డి ఉన్నారు.





→ జయచిత్ర - అమరెడ్డి ←



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు

● 22న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

సూళ్లూరుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఈనెల 22న ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ పథకం కింద రూ.12.77 కోట్లతో ఈ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించారు. దీని ప్రారంభోత్సవానికి రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

టీచర్ మెడలో చైన్ లాక్కెళ్లారు

తిరుపతి (నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని వినాయక గుడి వద్ద ఉపాధ్యాయుడి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటనపై సోమవారం ఫిర్యాదు అందింది. ఈనెల 15వ తేదీన రాయచోటిలో వివాహం కోసం కారులో కొందరు ఉపాధ్యాయులు బయలుదేరారు. ఈ క్రమంలో లక్ష్మీపురం సర్కిల్ వద్ద వీరు బహిర్భూమికి వెళ్లారు. తిరుచానూరుకు దారెటు అంటూ ఓ వ్యక్తి వీరిని అడిగాడు. వీరు సమాధానం చెప్పేలోపే ఉపాధ్యాయుడి మెడలోని 18 గ్రాముల గొలుసు లాక్కెళ్లిపోయాడు. ఉపాధ్యాయుడు అరిచేలోపే సమీపంలో ఉన్న మరో వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఆ దుండగుడు పరారయ్యాడు. పెళ్లి అనంతరం తిరిగొచ్చిన కేశవనాయన గుంటకు చెందిన టీచర్ చంగల్ రాజు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.1.6 లక్షల జరిమానా

తిరుపతి (నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న 16 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి, సీఐలు సుబ్బారెడ్డి, సంజీవ్ కుమార్, భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి వీరిని అదుపులోకి తీసుకుని 4వ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచారు. ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున రూ.1.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

జూన్ మొదటి వారంలో చంద్రగిరి కోటపై వెలుగులు



ఆర్కియాలజీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో ఏపీ టూరిజం కార్పొరేషన్ పీపీపీ విధానంలో లక్స్ అండ్ డెసిబిల్స్ సంస్థ ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్స్ షో జూన్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. సోమవారం రాత్రి ఎమ్మెల్యే పులివర్తి నాని కోట ఆర్కియాలజీ అధికారులతో సమీక్షించారు. సౌండ్ అండ్ లైటింగ్ షో ప్రారంభంలో జాప్యానికి కారణాలపై ఆరా తీశారు. మొదట షో ప్రారంభమైనప్పుడు కథ చరిత్ర ఆధారంగా ఉందని, గత ప్రభుత్వంలో మరమ్మతులు చేశాక అందులో మార్పులు చేయడంతో తమశాఖ ఉన్నతాధికారులు అనుమతివ్వలేదని అధికారులు వివరించారు. షోలో ప్రదర్శించే కథను నిర్దేశిత సంస్థ నిర్ధారించాక అనుమతిస్తామన్నారు. టూరింజంశాఖకు బోటింగ్ ఏర్పాటుకు అనుమతించినా కోనేరును శుభ్రం చేయలేదన్నారు. కోటకున్న 55 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ, ఆర్కియాలజీ అధికారులు సంయుక్తంగా సర్వేచేసి హద్దులు గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. కోట ప్రహరీపైనా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్కియాలజీ కన్సర్వేషన్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి కోరారు. మేషన్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భద్రతా తనిఖీలు



ఫొటోస్టూడియో వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రతాతనిఖీలు కొనసాగుతున్నాయి. సోమవారం పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్, విజిలెన్స్ హెల్త్, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులు సిబ్బందితో కలిసి ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. శ్రీవారిమెట్టు, ఆదిశేష విశ్రాంతిభవనం, ఎంబీసీ34, ఎస్ఎంసీ, ఏటీసీ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి తిరుమలకు వచ్చిన కూలీలను ప్రత్యేకంగా విచారించారు. వారి వివరాలను సేకరించి, ఎలాంటి ఆధారాలు లేనివారిని తిరుమల నుంచి పంపేశారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న వారి వేలిముద్రలు, ఐరిష్‌లను పరిశీలించి ఏదైనా నేర చరిత్ర ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. కొన్ని దుకాణాలు, ఫొటో స్టూడియోలు, ఫ్రూట్ షాపుల వద్ద కూడా తనిఖీలు చేపట్టారు.

నిమ్మ ధరలు ఢమాల్



గూడూరు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): గూడూరు మార్కెట్‌లో నిమ్మ ధరలు భారీగా పతనమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు నిమ్మధరలు స్థిరంగా ఉంటూ రైతులకు ఆదాయాన్ని ఇచ్చేవి. వారం రోజుల వరకు కిలో గరిష్టంగా రూ.120 నుంచి రూ.160 ధరలు పలికాయి. ప్రస్తుతం గరిష్టంగా రూ.40 వరకు అమ్ముడవుతున్నాయి. టిక్కీ బస్తా(50 కేజీలు) రూ.1000 నుంచి రూ.2000 పలకడంతో గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేరళకు రవాణా చేసే విషయంలో తమిళనాడు మార్కెట్ నుంచి పోటీ ఎక్కువ కావడంతో గూడూరులో ధరలు తగ్గిపోయాయని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు.


అర్జీని పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి


● తాగునీటి సమస్యను పరిష్కరించాలని జీడీ నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె పంచాయతీలోని తిమ్మిరెడ్డిపల్లె బీసీ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. కాలనీలో 40 కుటుంబాలు నివాసముంటున్నామని తెలిపారు. చెరువులో ఉన్న బోరు మోటారు రిపేరు కావడంతో అవస్థలు పడుతున్నామన్నారు.


● బ్యాంకు నిధులను స్వాహా చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్న విజయపురం మండలం కోసల నగరం సొసైటీ బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో రాధ, మాజీ సీఈవో మురగయ్యలపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఎన్‌వోసీ, ఏ ఇతర సర్టిఫికెట్లు కావాలన్నా రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు ఇవ్వాల్సి వస్తోందని ఆరోపించారు. విచారించాలని కోరారు.

సమస్యలివిగో.. పరిష్కరించండి

కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'లో బాధితుల వేడుకోలు

256 అర్జీలు స్వీకరించిన అధికారులు

చిత్తూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు బాధితులు తరలివచ్చారు. అధికారులకు అర్జీలను సమర్పించి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. బాధితుల నుంచి జేసీ విద్యాధరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 256 మంది అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూ, సర్వే శాఖలకు 198, పోలీసులకు 13, డీఆర్‌డీఏకు 11, విద్యుత్ శాఖకు 7, పౌరసరఫరాల శాఖకు 7, పశుసంవర్థకశాఖకు 2, విద్యాశాఖ, డీసీసీబీ, హౌసింగ్, మున్సిపాలిటీ తదితర శాఖలకు 17 అర్జీల చొప్పున ఉన్నాయి.

ప్రధాన అర్జీలిలా..

● సర్వే నెంబరు 193-5, 193-6లో ఏడు ఎకరాల డీకేటీ భూమిని మూడు కుటుంబాల వారు చదును చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నామని చౌడేపల్లె మండలం దిగువపల్లె మొట్లపల్లె యానాదులు తెలిపారు. ఐదేళ్ల కిందట మామిడి మొక్కలు నాటామన్నారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన అగ్రకులస్తులు ఇటీవల కోర్టు నుంచి కాగితాలు పంపించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు.


● వివిన్న ప్రతిభావంతుల కేటగిరీ కింద తనకు రావాల్సిన ఉద్యోగాన్ని ఇవ్వడం లేదని ఆర్సీపురం మండలం కూనేపల్లెకు చెందిన అంధుడైన రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను పీఎంఏ పోస్టుకు దరఖాస్తు చేసుకోగా.. మెరిట్ జాబితాలో తన పేరు వచ్చిందన్నారు. ఇప్పుడేమో అంధుడిగా ఉన్నందున పీఎంఏ ఉద్యోగం చేయలేవని డీసీహెచ్ఎస్ చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసు కార్యాలయానికి 38 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 38మంది అర్జీదారులు హాజరయ్యారు. బాధితుల నుంచి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు వినతిపత్రాలను స్వీకరించారు. భూ తగాదాలపై 12, కుటుంబ తగాదాలపై 7, డబ్బు తగాదాలపై 5, వేధింపులపై 5, ఇంటి తగాదాలపై 4, చీటింగ్‌పై 3, దారి తగాదాలపై 2 చొప్పున అర్జీలు ఉన్నాయి.


బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు


● రీ స్ట్రక్చరింగ్ పేరుతో చిత్తూరులోని ఎం.అగ్రహారం పాఠశాలను మురకంబట్టు పాఠశాలలో విలీనం చేస్తే విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రస్తుతం 3, 4, 5 తరగతుల విద్యార్థులు కలిపి 31 మంది ఉన్నారన్నారు. వీరిని ఇక్కడే కొనసాగించాలని కోరారు.


● ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాన్ని విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. స్వీపర్లతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 2018-2021 వరకు 350 మందికి జీతాలు ఇవ్వలేదన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ - సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నగరిలో ఒకసారి గెలిస్తే ఆ విజయం శాశ్వతమే

● మినీ మహానాడులో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో ఒకసారి గెలిస్తే ఆ గెలుపు శాశ్వతంగా నిలుస్తుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన నగరిలో సోమవారం మినీ మహానాడు వైభవంగా జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ నిరుపేదల పాలిట పెన్నిధిగా ఆవిర్భవించిందని, ప్రజల సంక్షేమమే పరమావధిగా కృషి చేస్తోందని అభివర్ణించారు. పార్టీకోసం కష్టించే వారికి ప్రత్యేకత కల్పించనున్నట్లు తెలిపారు. అధికారముందని ఇష్టానుసారంగా నడుచుకోరాదని, కక్షసాధింపు ధోరణి మన లక్ష్యం కాదని ఆయన స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో సైతం టీడీపీ విజయం తథ్యమని ఆయన వక్కాణించారు. నగరిలో 45 వేల మెజారిటీ రావడంతో పార్టీలకతీతంగా అందరూ టీడీపీకి ఓట్లేశారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో కోసలనగరాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్ది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేష్ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని అన్నారు. మరమగ్గాలకు, చేనేతలకు ఉచితంగా 500 యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని, గాలేరు.. నగరి సుజల స్రవంతిని పూర్తి చేసి నియోజకవర్గంలో సాగునీరు అందించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చక్రపాణిరెడ్డి, గంజి మాధవయ్య, చినబాబు, షణ్ముగం రెడ్డి, బాలాజీ, మీరా, దశరధవాసు, రమేష్‌బాబు, రమేష్‌రాజు, వెంకటయ్య, వెంకటేశ్వరరావు, ధనంజయ నాయుడు, జ్యోతి నాయుడు, లక్ష్మీప్రసన్న, హేమావతి, కృష్ణారెడ్డి, గుణశేఖర్, పురుషోత్తం నాయుడు, శివకుమార్ రెడ్డి, అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


మినీ మహానాడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో కూటమిదే వంద శాతం విజయం కావాలని.. ఇందుకు గ్రామస్థాయి నుంచే పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపు నిచ్చారు. పలమనేరు టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సూపర్‌సిక్స్‌లో ఇప్పటికే పలు కార్యక్రమాలను చేపట్టామని.. త్వరలోనే తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. జగన్ రాష్ట్రాన్ని అథోగతి చేస్తే కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నామినేటెడ్ పదవులు వచ్చినా.. రాకపోయినా క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేయాలని, అలాంటి వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. హంద్రీ-నీవా లైనింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని.. నియోజకవర్గంలో రోడ్లన్నీ పూర్తిచేస్తామని వివరించారు. రాజకీయాల్లో అవకాశాలు వస్తుంటాయని.. తాను ఎదగడానికి ఎన్టీఆర్, చంద్రబాబు కల్పించిన అవకాశాలే కారణమన్నారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడుకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు జయప్రకాష్, మండల పార్టీ అధ్యక్షులు కిషోర్‌గౌడ, రంగనాథ్, కుట్టి, సోమశేఖర్‌గౌడు, నాగరాజరెడ్డి, ఆనంద్, సీనియర్ నాయకులు ఆర్వీ బాలాజీ, రామచంద్రనాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యంగౌడు, చౌడప్ప, చెంగారెడ్డి, ముబారక్, శివకుమారి, ప్రమీళ, పర్వీన్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గురి తప్పకూడదు..!


ఫైరింగ్‌పై ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

చిత్తూరు సెంట్రల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శిక్షణ శిబిరంలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో రెండో రోజైన సోమవారం 220 మంది క్యాడెట్లకు ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. తుపాకీని ఉపయోగించడం, గురితప్పకుండా కాల్చడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంపు కమాండింగ్ అధికారి కల్నల్ నోయల్ వివేక్ మోనిస్ మాట్లాడుతూ.. క్యాడెట్లు ఎప్పుడూ ఎంచుకున్న లక్ష్యంవైపు పయనించాలని సూచించారు. మరో 320 మందికి మ్యాప్ రీడింగ్, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ క్యాంపు కమాండెంట్ మేజర్ లోకనాథం క్యాపును పర్యవేక్షించగా, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, శ్రీలత, చిరంజీవి, యుగంధర్, ధనంజయులు, రామచంద్ర తదితరులు శిక్షణ ఇచ్చారు.

వరసిద్ధుడి సేవలో జైళ్ల శాఖ డీజీ


అంజనీకుమార్‌కు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ సోమవారం కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, సీఐ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్ఐ ధరణీధర, చిత్తూరు జైళ్ల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పూర్వ కమిషనర్‌పై విచారణకు రవీంద్రబాబు నియామకం

చిత్తూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పూర్వ చిత్తూరు కమిషనర్ అరుణ వచ్చిన ఆరోపణలపై విచారణ చేయడానికి అడిషినల్ డైరెక్టర్, కర్నూలు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును ప్రభుత్వం నియమించింది. గతంలో చిత్తూరు కమిషనర్‌గా అరుణ పనిచేసిన కాలంలో పలు విభాగాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని.. విచారణ చేయాలంటూ టీడీపీ రాష్ట్ర నేత సప్తగిరి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దాంతో అప్పట్లో విచారణాధికారిగా అడిషినల్ డైరెక్టర్ నాగేంద్రకుమార్‌ను విచారణాధికారిగా నియమించింది. ఆయన సకాలంలో విచారణ చేయకపోవడంతో తాజాగా రవీంద్రబాబును ప్రభుత్వం నియమించింది.

పేటూరులో ఏనుగుల దాడులు

సోమల, మే 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో నెలరోజుల విరామం అనంతరం మళ్లీ పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి పేటూరు సమీపంలోని మామిడి, టమోటా తోటల్లో సంచరించి పంటలను ధ్వంసం చేశాయి. పేటూరుకు చెందిన దేశయ్య, చిట్టిబాబు, పురుషోత్తం మామిడి తోటల్లో తిన్నంత కాయలను తిని.. చెట్ల కొమ్మలను విరిచేశాయి. అలాగే సమీప రైతుల పొలాల్లోని టమోటా, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. శనివారం రాత్రి రాంపల్లె బీట్ సమీప పంటలను తొక్కి నష్టపరిచి అక్కడినుంచి తమ పాత స్థావరమైన కనికల చెరువు వద్దకు చేరుకున్నాయి. పగలు అక్కడే ఉండి, రాత్రుల్లో సమీపంలోని అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోని పొలాల వైపు వెళ్లి పంటలను నష్టపరుస్తున్నాయి. ఏడాదిగా మామిడి తోటలను వేలకు వేలు వ్యయం చేసి సంరక్షిస్తే కోతల సమయంలో ఏనుగుల దాడులతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఏనుగుల సంచారంపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పేటూరు సమీపంలో ధ్వంసమైన మామిడి చెట్లు

వైసీపీలో బీసీలకు ప్రాధాన్యమివ్వడం లేదు

అందుకే రాజీనామా చేశా - తవణంపల్లె ఎంపీటీసీ బాబు


రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు అందజేస్తున్న గాండ్ల బాబు

తవణంపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీలో బీసీలకు తగిన ప్రాధాన్యమివ్వడం లేదు. అందుకే నా పదవికి రాజీనామా చేశా' అని తవణంపల్లె ఎంపీటీసీ సభ్యుడు గాండ్ల బాబు తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ-2 ఉప ఎన్నిక జరిగింది. మండలంలో వైసీపీకి 14 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. పదవి కోసం వీరిలో.. గాండ్ల బాబు (తవణంపల్లె), అనసూయమ్మ (చెర్లోపల్లె), డేవిడ్ (పుణ్యసముద్రం) పోటీపడ్డారు. వైసీపీ నాయకులు చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యురాలు అనసూయమ్మను వైస్ ఎంపీపీ-2గా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దీనిపై బాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో బీసీలకు ప్రాధాన్యం లేదని పేర్కొంటూ ఎంపీడీవో రాఘవేంద్రరాజుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువ రైతు మృతి


సందీప్ (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి యువ రైతు మృతి చెందిన సంఘటన సోమల మండలంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు .. చౌడేపల్లె మండలం లద్దిగం గ్రామానికి చెందిన శంకరయ్య కుమారుడు సందీప్ (21) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించేవాడు. తన సొంత పనుల నిమిత్తం సోమలకు ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. సోమల మండలం ఇరికిపెంట సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడటంతో సందీప్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించేలోపు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలసముద్రంలో సినిమా షూటింగ్



పాలసముద్రం, మే 19 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురంలో ఆర్వీ నెంబర్ 1 ప్రొడక్షన్ ఆధ్వర్యంలో సోమవారం సినిమా షూటింగ్ జరిగింది. మండలంలో మూడ్రోజులపాటు షూటింగ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ భజన మందిరంలో పూజలు చేశాక హీరో హీరోయిన్లు విజయరాజు, రాధాకృష్ణమూర్తిపై నిర్మాత రాజేంద్రబాబు క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. డైరెక్టర్ బాలు, స్ర్కీన్‌ప్లే నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ధనంజయ, కో ప్రొడ్యూసర్ సుబ్రహ్మణ్యంరాజు, సంగీత దర్శకుడు శంకర్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సర్వీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు 25లోగా అందించాలి

● డీడీవోలకు ఖజానాశాఖ డీడీ సూచన

చిత్తూరు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల వార్షిక సర్వీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లను ఈనెల 25వ తేదీలోగా మేనెల రెగ్యులర్ జీతాల బిల్లులతోపాటు డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్లు (డీడీవోలు) ఖజానా శాఖకు అందించాలని డీడీ రామచంద్ర సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సర్టిఫికెట్లను ధ్రువీకరణ చేస్తూ డీడీవోలు సంతకాలు చేయాలని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల క్రితం సుమారు 95 శాతం మంది ఉద్యోగులు ఆయా సచివాలయాల పరిధిలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసుకున్నారన్నారు. మిగిలిన ఐదు శాతం మంది సీఎఫ్ఎంఎస్‌లో వేలిముద్ర వేసి మ్యాపింగ్ పంపాలని ఆదేశించారు. బయోమెట్రిక్ వేయని ఉద్యోగుల మే నెల జీతాల బిల్లులు ఖజానాశాఖకు పంపొద్దని, ఒకవేళ పంపినా వాటిని సీఎఫ్ఎంఎస్ తీసుకోదని తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం) మే 19(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణపడ్డారు. రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా కార్వేటినగరం ఉత్తనూరు గ్రామానికి చెందిన హరి కొన్ని రోజులుగా తిరుపతిలో ఉంటున్నాడు. రూరల్ పరిధిలోని ఒక దుకాణం వద్ద నిత్యం మద్యం తాగే క్రమంలో మరొక వ్యక్తితో పరిచయమైంది. సోమవారం మద్యం మత్తులో మామిడికాయల మండీ ఆటోస్టాండు వద్ద ఇద్దరూ గొడవపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న సదరు వ్యక్తి స్నేహితులు వచ్చి హరిపై బీరు బాటిళ్లతో దాడి చేశారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన హరిని రుయాలో చేర్పించారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) మే 19(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని సోమవారం ఈస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. కడప జిల్లా సీకే దిన్నెకు చెందిన సతీష్ నాయక్, ఆంజనేయులు నాయక్ ఇతర ప్రాంతాల నుంచి కల్తీ మద్యం తీసుకొచ్చి గోవిందరాజస్వామి కోనేరు వద్ద విక్రయిస్తుండగా రహస్య సమాచారం మేరకు ఎస్ఐ గిరిబాబు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కల్తీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ చెప్పారు.

టీడీపీలోకి చేరికలు



కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీకి చెందిన ఆరుగురు వైసీపీ కార్యకర్తలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పంచాయతీకి చెందిన మురుగేశ్, సి.రాజప్ప, చంద్రప్ప, వి.మురుగేశ్ (ఆర్ముగం), రాజా, ఓం శక్తి గురుస్వామి డి.వెంకటేశ్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పసుపు కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి మహేంద్ర, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, యూనిట్ ఇన్‌చార్జి కనకరాజు, బీరప్ప, తిమ్మప్ప, దేవేంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న కంచర్ల, ప్రేమ్‌కుమార్

కుప్పం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం దేవరాజపురం గ్రామంలో వాననీటి కుంటలో పడి మృతి చెందిన ముగ్గురు చిన్నారుల కుటుంబాలకు సోమవారం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష వంతున మొత్తం రూ.3 లక్షల తక్షణ ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అందజేశారు. ఈ గ్రామానికి చెందిన షాలిని, గౌతమి, అశ్విని అనే చిన్నారులు ఆడుకుంటూ నీటి కుంటలో పడి ఊపిరాడకుండా మృతి చెందిన విషయం తెలిసిందే. ఆర్థిక సాయమందించిన ఎమ్మెల్సీ కంచర్ల మాట్లాడుతూ భవిష్యత్తులోనై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఆ కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, డీఎస్పీ పార్థసారథి, కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ థింగ్స్‌పై నైపుణ్యం పెంచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న సునీల్‌రాజ్ తదితరులు

కుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ఇంటర్నెట్ భాగం అయ్యిందన్నారు. ఇంటర్నెట్ థింగ్స్‌పై ప్రతిఒక్కరూ నైపుణ్యాన్ని పెంచుకోవాలని, ఇందుకోసం వారంరోజులపాటు జరుగనున్న సదస్సు ఉపయోగపడుతుందని చెప్పారు. ఐసీటీ అకాడమీ రీజనల్ మేనేజరు నగేశ్ మాట్లాడుతూ ఇంటర్నెట్ థింగ్స్ అవసరాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీటీ అకాడమీ టెక్నికల్ కె.శివగోపాల్, కేఈసీ ప్రిన్సిపాల్ సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఆర్ అండ్ డి విభాగాధిపతి జీఎన్ కోదండరామయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కుమార్, విభాగాధిపతులు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు



భూపతి, రఘులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టడిన ప్రతి కార్యకర్తకు పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజవకవర్గ అధ్యక్షుడు చలపతి తెలిపారు. రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన భూపతి, కడ రాజకీయ సలహామండలి సభ్యుడిగా నియమితులైన రఘులను సోమవారం పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, చంద్రశేఖర్‌రెడ్డి, కామరాజనాయక్, మంజునాథ్‌రెడ్డి, వెంకటరమణ, బాలరాజు, సుబ్రీ, ఆదిల్, పెరుమాళ్, గజేంద్ర, మంజునాథ్, నవీన్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో కూటమి నేతలు

రామకుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం త్రివిధ దళాలు చేసిన పోరాటాన్ని ఎన్నటికీ మరువలేమని రామకుప్పం మండలం ఎన్డీయే నేతలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్ నుంచి షాదీమహల్ సర్కిల్, ఇందిరానగర్ సర్కిల్, ఆటోస్టాండు సర్కిల్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నేతలు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, చలపతి, చిన్నికృష్ణ, నరసింహులు, రామ్మూర్తి, వెంకట్రామగౌడు, కామరాజనాయక్, గజేంద్ర, రామకృష్ణప్ప, వెంకటరమణ, బాలరాజు, సుబ్రీ, అవినాశ్, సతీష్, దయానంద్, మంజునాథ్, పెరుమాళ్, జనసేన నేతలు హరీష్, పవన్, మహేష్, బీజేపీ నేతలు ఆంజనేయులు, రాజసింహా, నాగరాజు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళులు

పలమనేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పట్టణ సీపీఎం నాయకులు గిరిధరగుప్తా ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజా, జయంతి, ధనమ్మ, రత్నమ్మ, లలితారాణి, జాహ్నవి, లక్ష్మయ్య, ప్రతాప్, బన్ని, శ్రీరామయ్య, గంగప్ప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మయ్యగారిపల్లె టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌నాయుడు

రొంపిచెర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడుగా చంద్రశేఖర్‌నాయుడిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ తెలిపారు. సోమవారం కట్టకిందశివాలయం వద్ద గ్రామకమిటీ సమావేశం జరిగింది. గ్రామకమిటీ ఉపాధ్యక్షులుగా ఈశ్వరయ్య, అబ్దుల్‌నూరు, బూత్ కమిటీ అధ్యక్షులుగా కె.సహదేవ, కిరణ్, సధాకర్, అమరనాథరెడ్డిలు ఎన్నికయ్యారు. గ్రామంలో టీడీపీ సభ్యత్వం పొందిన సభ్యులకు పార్టీ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంపూర్ణమ్మ, నాయకులు నాగరాజ, సురేంద్ర, రమేష్‌రెడ్డి, మహమ్మదాలి, రఫీ, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, మే 19 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు పలువురు దాతలు విరాళాలు అందజేసినట్లు ఆ కమిటీ అధ్యక్షులు ఎన్.మునివెంకటప్ప తెలిపారు. సోమవారం నడింపల్లె పంచాయతీ సూరయ్యగారిపల్లె లో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జీసీకే. ప్రసాద్, ఉపాధ్యాయురాలు అమృత దంపతులు రూ.1,00,116, రాజగోపాల్ రూ.10 వేలు, శివ, పుష్పలత దంపతులు రూ.10 వేలు, టీచర్ హరినాథ్, చంద్రకళ రూ. 10 వేలు, మాజీ సర్పంచ్ మునిచంద్ర రూ.10 వేలు, వై. రెడ్డి రూ.10 వేలు, మునిచంద్రయ్య రూ.5 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జ్యోతీశ్వరుడు, వై.సాంబయ్య, శ్రీరాములు, సాంబశివయ్య, సీజీ.రెడ్డెప్ప, కె. నగేశ్, వీవీ.రమణ, జనార్థన్, సదాశివయ్య, శెట్టివారి మోహన్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే జనసేన పార్టీకి బలం



గుర్తింపు కార్డులు అందజేస్తున్న జనసేన నాయకుడు పగడాల రమణ

పుంగనూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి కార్యకర్తలే బలమని జిల్లా జనసేన కార్యదర్శి పగడాల రమణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేశిధి వికాష్, రాయల్‌కుమార్, పాముల హరి, పవన్, భూషణ్, శ్రీకాంత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ..!

- కురుస్తున్న వర్షాలతో ఊరట
- పారుతున్న కలుజులు
- నిండుతున్న కౌండిన్య నది
- ఆనందంలో అన్నదాత



కలుజు పారుతున్న నక్కపల్లి చెరువు



కన్నమాకులపల్లి వద్ద నిండిన చెక్‌డ్యాం

పలమనేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా చుక్కనీరు లేని చెరువులకు నీరు చేరుతోంది. మే ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని నక్కపల్లిచెరువు, పెద్దచెరువు, పెంట చెరువులు నిండి సోమవారం నుంచి కలుజు పారుతున్నాయి. కలుజు నీరు చిన్న కాలువ నుంచి కౌండిన్యనదికి చేరుతోంది. దీంతో చిన్నకాలువ కలిసే ప్రాంతంలో కౌండిన్యనదిపై నిర్మించిన చెక్‌డ్యాం పూర్తిగా నిండిపోయి నీరు పొర్లి కౌండిన్యనది నుంచి దిగువ ప్రాంతానికి వెళుతున్నాయి. దీంతో కౌండిన్య నదికి జలకళ సంతరించుకొంది. ఈ వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగితే పలమనేరు ప్రజల దాహార్తి తీర్చేందుకు కాలువపల్లి వద్ద నిర్మించిన కౌండిన్య జలాశయానికి సైతం నీరు చేరుతుంది. జలాశయం ఎండిపోయి రెండేళ్లు కావస్తోంది. దీంతో పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు సంపులకు లక్షలాది రూపాయలు అద్దె రూపంలో చెల్లిస్తూ ట్రాక్టర్లతో నీటిని తెప్పించి ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా మే మాసంలోనే కౌండిన్యనదికి జలకళ సంతరించుకుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాధారణంగా ఈ ప్రాంతంలో సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో బంగాళాఖాతంలో ఏర్పడే వాయుగుండ ప్రభావంతో వర్షాలు కురిసి చెరువులకు నీరు చేరడం.. చెరువులు నిండి కౌండిన్యకు నీరు చేరడం సాధారణం. అయితే ఈ ఏడాది ఇందుకు భిన్నంగా మే నెలలోనే వర్షాలు కురవడం గమనార్హం. అయితే ఈ కౌండిన్య నదిపై దాదాపు 15 చెక్‌డ్యాంలు ఇసుక అక్రమ రవాణాదారుల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. చెక్‌డ్యాంల వద్ద చుక్కనీరు నిల్వ ఉండే అవకాశాలు లేవు. 8 నెలల క్రితమే స్థానిక ఎమ్మెల్యే కౌండిన్య నదిపై చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క చోటా నిర్మాణాలు చేపట్టిన పాపానపోలేదు. ఎంత వర్షాలు కురిసినా కౌండిన్యలో ప్రవహించే నీరు వృథాగా తమిళనాడుకు తరలిపోవాల్సిందేనని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి కౌండిన్యనీటిని నిలువరించేందుకు చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. చెక్‌డ్యాంలలో నీరుంటే కౌండిన్య పరివాహక ప్రాంతంలోని వేలాది ఎకరాలకు సాగునీటి సమస్య ఉండదని రైతులు వాపోతున్నారు.

బాబు బ్రాండుతోనే పారిశ్రామిక రంగం పరుగులు: గౌనివారి

శాంతిపురం, మే 19 (ఆంధ్రజ్యోతి) : బాబు బ్రాండుతోనే రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతోందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం వెంకటేపల్లె గ్రామంలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. 2019-24 మధ్య కాలంలో జగన్ విధ్వంస పరిపాలన సాగడంతో పెట్టుబడదారులు పొరుగు రాష్ట్రాలకు పారిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక విధానంపై నూతన పాలసీ తీసుకురావడంతో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థలు బారులు తీరుతున్నాయన్నారు. కంపెనీలు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా వెనువెంటనే ప్రాజెక్టుల స్థాపనకు శ్రీకారం చుట్టడం విశేషం అన్నారు. అధికారంలోకి వచ్చిన 11 నెలలకే 6 సార్లు ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించి 76 ప్రాజెక్టులు ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు జరిగాయన్నారు. గోదావరి, కృష్ణానదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాలకు ఆధ్యాత్మిక శోభ పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం సూచించారన్నారు. ఆరో సారి జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో రూ.33 వేల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. వాటితో 35 వేల మందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతుందని వివరించారు.

దళిత విద్యార్థిపై దాడి దారుణం



అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకుల వినతి

పుంగనూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని విద్యానికేతన్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న జేమ్స్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాం డ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. విద్యార్థి జేమ్స్‌ను చంపడానికి ప్రయత్నం చేయడం, అతనిపై మూత్రం పోయడం దారుణమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య దేశంలో దళితులపై దాడులు జరగడం హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వారిపై నామమాత్రంగా కేసులు నమోదు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, జనసేన నాయకులు శ్రీనివాసులు, కృష్ణప్ప, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

సోమల, మే 19 (ఆంధ్రజ్యోతి): వల్లిగట్ల పంచాయతీలోని సోమప్పచెరువు వద్ద కొలువుదీరిన నల్లగంగమ్మ ఆలయంలో సోమవారం ఉదయం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. నగిరిండ్లు, దండువారిపల్లె, ముడివారిపల్లె, పాతూరు, అగ్రహారం, వడ్డిపల్లె, పెద్దూరు, కొత్తపల్లె గ్రామాల మహిళలు బోణాలు, పిండిదీపాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను పర్వతాల చంద్రబాబు, సుబ్బరాయులు, హరిబాబు పర్యవేక్షించారు.

పేటూరు టీడీపీ అధ్యక్షుడిగా బాలాజీ నాయుడు



సోమల, మే 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పేటూరు పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా బాలాజీ నాయుడును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. సోమవారం చినకమ్మపల్లెలో జరిగిన సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు మాట్లాడుతూ గ్రామ కమిటీ సభ్యులు కార్యకర్తలను సమన్వయం చేసుకునేలా కమిటీ వ్యవహరించాలన్నారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలాజీనాయుడు, కార్యదర్శి ఎం. పవన్‌కళ్యాణ్ సభ్యులను సన్మానించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, రెడ్డెప్పనాయుడు, సుధాకర్, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్‌రెడ్డి

పుంగనూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వనమలదిన్నె రైతు సేవా కేంద్రంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ కలిగిన రైతులకు ఆధునిక వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్ హరినాయక్, ఏఈవో శివశంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పుంగమ్మ చెరువుకట్ట రోడ్డు పనులు పూర్తిచేయాలి

పుంగనూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- కర్ణాటక మార్గంలోని పుంగమ్మ చెరువు కట్ట రోడ్డు వేయడానికి గత ప్రభుత్వం ఆర్అండ్‌బీ ద్వారా రూ.9.8 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్ తెలిపారు. సోమవారం పుంగనూరు చెరువు కట్టపై పడిన గుంతల రోడ్డును పరిశీలించారు. నిత్యం ఈ రోడ్డుపై కర్ణాటక నుంచి వేల సంఖ్యలో భక్తులు పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి వస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కొంత వరకు పనులు చేశారని, ప్రస్తుతం పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాని కోరారు.

ఉగ్రరూపిణీ.. ప్రసన్నమూం..!

- నేడు కుప్పం గంగమ్మ శిరస్సు ఊరేగింపు
- రేపు విశ్వరూప దర్శనం



కుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్నయమ్మ.. ఉగ్రరూపం భరించలేకపోయారు జనం. ఏడుకొండల్లో కొలువైన వెంకన్నను వేడుకున్నారు. వేవేగ తరలివచ్చిన శ్రీనివాసుడు కోపోద్రిక్తుడై చెల్లెలు శిరస్సును ఉత్తర క్షణంలో ఉత్తరించాడు. అన్నా అని వేడుకోగా ఏడాదికోమారు లోకాన్ని చూసి భక్తులను కరుణించే భాగ్యం కలిగించాడు. అన్నాచెల్లెళ్ల బంధంకన్నా భక్తులతో ముడిపడిన బంధం ఎక్కువనడానికి కుప్పం గంగజాతర ఒక ఉదాహరణ.

కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబపై స్థానికంగా ఒక కథ వినిపిస్తుంది. తిరుమల వేంకటేశ్వరుడు, కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ అన్నాచెల్లెళ్లట. తొలుత ఉగ్రరూపంలో ఉన్న అమ్మవారికి 'ప్రసన్న' అనే మాట ముందు చేర్చలేదు. తొలుత గంగమ్మ అమ్మవారు శ్మశానాలలో పడి శవాలను భక్షించి ఆకలి తీర్చుకునేదట. ఆ సమయంలో ఆమెను చూసిన జనం ఉగ్రరూపాన్ని భరించలేక గుండెలదిరి బిక్కుబిక్కుమంటూ కాలం గడిపేవారట. చివరికి భీతితో వెంకన్న శరణు కోరగా, ఆయన భక్తుల మొర ఆలకించి శీఘ్రంగా తరలివచ్చి భక్తులను బాధిస్తున్న చెల్లెలు గంగమాంబ శిరస్సును కోపోద్రిక్తుడై నరికేశాడట. పొరపాటు తెలుసుకున్న మొండెంనుంచి వేరైన గంగమ్మ శిరస్సు వేడుకోగా.. ఏడాదికోమారు మాత్రం సంపూర్ణ దేహంతో కనిపించి శరణుకోరి వచ్చే భక్తులను కరుణించే వరం ప్రసాదించాడట. అదిగో నాడు వేంకటేశ్వరుడు ప్రసాదించిన వరమే నేటి ఈ కుప్పం గంగజాతర. ఏడాది మొత్తం తల్లి దేహం ఆలయంలో తెర వెనుక శిరస్సులేని మొండెం రూపంలోనే మరుగున ఉండిపోతుంది. ఆలయంలో పక్కనే గల ముత్తుమారెమ్మకు, గంగమ్మ ప్రతిరూపంగా గర్భగుడిలో ఉండే చిన్నపాటి అమ్మవారి రూపానికి మాత్రమే పూజలు జరుగుతాయి. అయినా సరే.. ఏ క్షణంలో ఉగ్రరూపంలో బయటికొస్తుందోనన్న భయంతో అమ్మవారి పేరుకు ముందు ప్రసన్న అని చేర్చి, శ్రీనివాసుని చెల్లెలు కాబట్టి 'తిరుపతి' అనే పదం అతికించారు. దీంతో కుప్పంలోని గంగమ్మను ప్రసన్న తిరుపతి గంగమాంబ అని పిలుస్తారు.

● వారంరోజుల జాతర మహోత్సవాలు

కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలు ఏటా మే మాసంలో వారం రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. గణపతి ఉత్సవంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు ముత్తుమారెమ్మలకు శేష, సింహ, అశ్వ వాహన సేవలతో కొనసాగుతాయి. చివరి మూడు రోజులు అత్యంత ప్రాముఖ్యమైన ముత్తుమారెమ్మ అగ్నిగుండ మహోత్సవం, గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపు, అమ్మవారి విశ్వరూప దర్శనమనే మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. సోమవారం నాడు ముత్తుమారెమ్మ అగ్నిగుండ మహోత్సవం జరిగింది. మంగళవారం నాడు అమ్మవారి శిరస్సు ఊరేగింపు నిర్వహించనున్నారు. చివరి రోజైన బుధవారం అమ్మవారు విశ్వరూపంలో భక్తులకు దర్శనమిస్తారు.

● అంతర్రాష్ట్ర జాతర:

కుప్పం గంగమ్మ జాతర అంటే అంతర్రాష్ట్ర పర్వం. మూడు రాష్ట్రాల కూడలియైన కుప్పంలో వెలసిన ప్రసన్న ముత్తుమారెమ్మ జాతర మహోత్సవాలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. చివరి మూడు రోజులూ ఇసుకవేస్తే రాలనంత జనం కుప్పంలో చేరుతారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోని కుటుంబాలలో బంధుమిత్రుల కోలాహలం మిన్నంటుంది. అమ్మవారిని దర్శించుకుని ఆమె దీవెనలు పొందడానికి, మొక్కులు తీర్చుకోవడానికి తండోపతండాలుగా తరలిచ్చే జనంతో సుమారు ఐదు కిలోమీటర్ల వరకు కిక్కిరిసిపోతాయి. బుధవారం నాడు ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి విశ్వరూప సందర్శన భాగ్యం భక్తులకు లభిస్తుంది. రాత్రి అమ్మవారిని గంగబావి దగ్గరికి ఊరేగింపుగా తరలించి, అక్కడ ఆమె కళ్లు తొలగించి జలావాసం చేయించడంతో కుప్పం గంజాతర మహోత్సవ ఘట్టం ముగుస్తుంది.

వైభవంగా దుర్యోధన వధ



గుడుపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలోని యామగానిపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దుర్యోధన వధ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు ధర్మరాజుల మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం దుర్యోధన వధ ఘట్టాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సింహవాహనంపై ముత్యాలమ్మ



రొంపిచెర్లలో ముత్యాలమ్మ ఊరేగింపు

రొంపిచెర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత ముత్యాలమ్మ జాతరలో భాగంగా సోమవారం అమ్మవారిని సింహవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలో ఇంటింటా భక్తులు హారతులు పట్టారు. పూజారి గుణశేఖర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సల్లాపురెమ్మ ఆలయ కుంభాభిషేకం



బైరెడ్డిపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలోని సల్లాపురెమ్మ ఆలయ కుం భాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మునివీరయ్య, వీరభద్రయ్య, నాగేంద్రప్రసాద్ శాస్త్రోక్తంగా హోమం, మహా పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

సోమలలో గంగజాతర సందడి



సోమలలో చల్లకుండలకు పూజలు

సోమల, మే 19 (ఆంధ్రజ్యోతి): సోమలలో గంగజాతర సందర్భంగా నడివీధి గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారిని ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు చేపట్టారు. పట్టణ వీధుల్లో బలిపోతుకు, చల్లకుండలకు ఇంటింటా మహిళలు పూజలు చేసి కానుకలు చెల్లించారు. అమ్మవారి శిరస్సును శెట్టివారి చంద్రశేఖర్ రెడ్డి ఇంటి నుంచి ఊరేగింపుగా రామాలయం వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అలాగే దిడ్డివారిపల్లె, దాసరివారిపల్లె, బుంగావారిపల్లె, చిన్నసోమల, ముంద్రివారిపల్లె, సోమల దళితవాడల్లో గంగ జాతర సందడి నెలకొంది.

నేడు టీడీపీ జిల్లా కార్యాలయంలో మినీ మహానాడు



టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న మినీ మహానాడుకు జరుగుతున్న ఏర్పాట్లు

చిత్తూరు సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో మినీ మహానాడును ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే మినీ మహానాడులో రాష్ట్ర పార్టీ ఆదేశాలమేరకు వివిధ అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. మధ్యాహ్నం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు స్థాయి కమిటీలను ఎంపిక చేయనున్నారు. నియోజకవర్గ పరిశీలకులు సునీల్ కుమార్ హాజరుకానున్నారు. మినీ మహానాడుకు టీడీపీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, క్లస్టర్, డివిజన్, పంచాయతీ ఇన్చార్జ్‌లు, అనుబంధ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

శరవణపురంలో నీటి సమస్యను తీర్చండి

చిత్తూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 28వ డివిజన్ శరవణపురంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్రలు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురు మహిళలు మాట్లాడుతూ శరవణపురానికి ఎనిమిది రోజులకొకసారి ట్యాంకరు వస్తోందని, వచ్చే నీరు కూడా కాలనీవాసుల అవసరాలకు సరిపోవడం లేదన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎంఈ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్‌కు 2, ప్రజారోగ్యానికి 2, రెవెన్యూకు 1, మెప్మాకు 1 అర్జీ అందాయి.

నీటి తొట్టె పనులను వేగవంతం చేయండి



నీటి తొట్టెను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం

గుడిపాల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువుల నీటి తొట్టెలు, షెడ్ల నిర్మాణాలు, షోక్, కంపోస్టు పిట్‌లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం క్షేత్రస్థాయి సహాయకులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్ర స్థాయి సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు మామిడి, జామ, సపోట, అల్లనేరేడు, కొబ్బరి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటల అభివృద్ధికి అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఏఎల్‌పురంలో పశువుల నీటి తొట్టెను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురప్ప నాయుడు, ఏపీవో శ్రీనివాసులు, జేఈ మునిరత్నం, సాంకేతిక సహాయకులు సుందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలేటి గంగమ్మ ఆలయంలో వైభవంగా చాటింపు

● తొలిగుంజ నాటి పూజలు చేసిన మహిళలు



తొలి గుంజకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఐరాల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఐరాలలోని గార్గేయ నదీ తీరాన వెలసిన పాలేటమ్మ ఆలయంలో నిర్వహించనున్న 48వ గంగ జాతరకు సోమవారం చాటింపును ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన మహిళలు తొలి గుంజకు పూజలు నిర్వహించి నాటారు. సాయంత్రం అమ్మవారికి 108 బిందెలతో నీరు పోసి అభిషేకం నిర్వహించారు. రాత్రి గెరిగ దుత్త పూజను నిర్వహించి గంగ చాటును పెట్టారు ఆలయం వద్ద ఈనెల 27, 28 తేదీల్లో గంగ జాతరను నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంకే బాలాజీ తెలిపారు. జిల్లాలోని పాలేటమ్మ భక్తులందరూ జాతరకు విచ్చేయాలని ఆయన కోరారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండు

పెనుమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): భార్య, మామపై దాడి చేసిన కేసులో అల్లుడికి కోర్టు రిమాండు విధించిన ఘటన పెనుమూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని మఠంపల్లి గ్రామానికి చెందిన రామ్మూర్తి ఆచారి తన కుమార్తె జ్యోత్స్నను చిత్తూరుకు చెందిన నాగరాజ ఆచారికి ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలంగా వీరిద్దరి మధ్య గొడవలు రావడంతో చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి జ్యోత్స్న తన పుట్టినిల్లు అయిన మఠంపల్లిలో ఉండగా, ఆమెపేరుపైన ఉన్న ఆస్తిని అడగటానికి భర్త నాగరాజు మఠంపల్లికి వచ్చి గొడవ పడ్డాడు. ఈ గొడవలో జ్యోత్స్న తండ్రి రామ్మూర్తి ఆచారికి రక్త గాయాలు కావడంతో వారిచ్చిన ఫిర్యాదు మేరకు నాగరాజును ఎస్ఐ రామచంద్రయ్య చిత్తూరు కోర్టుకు తరలించగా, జడ్జి అతడికి రిమాండు విధించారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు.

● చవటగుంటలోని మీనాక్షి సమేత అవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం, పూల అలంకరణ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

● ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి పాలాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

తవణంపల్లె వైస్ ఎంపీపీ-2గా అనసూయమ్మ



వైస్ ఎంపీపీ-2గా డిక్లరేషన్ అందుకుంటున్న అనసూయమ్మ

తవణంపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ-2గా చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యురాలు పి.అనసూయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీగా ఉన్న గోవిందరెడ్డిపల్లె ఎంపీటీసీ గీత తన పదవికి రాజీనామా చేయడంతో, వైస్ఎంపీపీగా ఉన్న మల్లకుంట ఎంపీటీసీ పట్నం ప్రతాప్‌రెడ్డి ఎంపీపీగా ఎన్నికయ్యారు. దీంతో ఖాళీగా ఉన్న వైస్ఎంపీపీ-2 ఎన్నికకు ఎన్నికల అధికారులు శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. సోమవారం ఉదయం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి డీపీవో సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. మండల పార్టీ నిర్ణయం మేరకు వైస్ ఎంపీపీ-2గా చెర్లోపల్లె ఎంపీటీసీ పి.అనసూయమ్మను ఎన్నుకునేందుకు మోదలపల్లె ఎంపీటీసీ ధనంజయరెడ్డి ప్రతిపాదించగా, మిగిలిన ఎంపీటీసీ సభ్యులు బలపరిచి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. దీంతో అనసూయమ్మ వైస్ ఎంపీపీ-2గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డీపీవో సుధాకర్‌రావు ప్రకటిస్తూ డిక్లరేషన్ అందజేసి, ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

భూములు ఆక్రమించారంటూ దుష్ప్రచారం

- గువ్వకల్లు రైతుల ఖండన

చిత్తూరు సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): భూములు ఆక్రమించారంటూ తమపై దుష్ప్రచారం చేయడం తగదని చిత్తూరు మండలం గువ్వకల్లు పంచాయతీకి చెందిన రైతులు అన్నారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ తమ అనుభవంలో ఉన్న భూముల్లో తాము మామిడి చెట్లు నాటామని చెప్పారు. అయితే సదరు భూములకు పాస్‌బుక్ లేదనే కారణంతో తహసీల్దారు తాము నాటిన మామిడి మొక్కలను తొలగించారని అన్నారు. ఈ విషయంపై తాము హైకోర్టుకు వెళ్లామని, హైకోర్టు తహసీల్దారుకు తగుసూచనలిచ్చిందన్నారు. తమపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని చెప్పారు. ఈ సమావేశంలో రైతులు మోహన్‌బాబు, జేజులు, పవన్‌కుమార్, జయరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో 'సూపర్ సిక్స్' అమలు

గుడిపాల, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రికార్డుస్థాయిలో ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేయడం హర్షదాయకమని రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూన్ 12న తల్లికి వందనం, వితంతు, ఒంటరి మహిళలకు కొత్త పింఛన్లు అందిస్తారన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత ఆర్టీసీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను ఎన్ని ఇబ్బందులున్నా అమలు చేయడం ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

తవణంపల్లె ఎంపీడీవోగా హరిప్రసాద్‌రెడ్డి



తవణంపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె ఎంపీడీవోగా హరిప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా పెనమలూరు మండలంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీవోగా పదోన్నతి పొంది బదిలీపై చిత్తూరు జిల్లాకు వచ్చారు. ఈ మేరకు జడ్పీసీఈవో రవికుమార్ నాయుడు తవణంపల్లె ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీ అనుబంధ కమిటీ అధ్యక్షుల నియామకం



దొరబాబు, వి.గజేంద్ర

బంగారుపాళ్యం, మే 19 (ఆంధ్ర జ్యోతి): మండల తెలుగు దేశం పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షుల నియామకాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణిప్రసాద్ సోమవారం ప్రకటించారు. మండలంలోని కచ్చెటివారిపల్లెకి చెందిన దొరబాబును ఐటీడీపీ మండల అధ్యక్షులుగా నియమించగా, కేఎం కండ్రిగ పంచాయతీకి చెందిన వి.గజేంద్రని మండల రైతు విభాగ అధ్యక్షులుగా నియమించారు. వీరు మండలాధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తామని వారు చెప్పారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజస్తంభ పూజలో ధర్మకర్త సహా ఉభయదారులు

వెదురుకుప్పం, మే 19 (ఆంధ్ర జ్యోతి): వెదురు కుప్పం మండలం జక్కిదొన మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. జక్కిదొన ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొట్లవారిపల్లికి చెందిన భీమనేని శివప్రసాద్ నాయుడు, నారాయణమ్మ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. సోమవారం నుంచి హరికథ కాలక్షేపం మొదలైంది. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త భీమనేని మాధవ నాయుడు పర్యవేక్షించారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు వైభవంగా ధ్వజారోహణం



పెద్ద శేష వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలస్వామి



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో నిద్ర మేల్కొలిపి నిత్యకైంకర్యాలు, అభిషేకం చేశారు. అనంతరం ధ్వజప్రతిష్ఠ, రక్షాబంధనం, భేరీతాడనం, బలిహరణం, తిరుమాడ వీధి ఉత్సవం నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తర్వాత ఉభయ దేవేరులతో పాటు వేణుగోపాలస్వామి వారిని తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ వారు నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది.

పెద్దశేష వాహనంపై వేణుగోపాలుడి విహారం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కోలాటాలు, చెక్కభజనలు, బాజాభజంత్రీల మధ్య పెద్ద శేష వాహనంపై వేణుగోపాలస్వామి విహరించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామిని వేదపండితులు ఏకాంత సేవలో పవళింపజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్నమ్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, కంకణ భట్టర్, తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణ దాశరథి, గోపాలాచారి, రమేష్, శబరీష్, ధ్వనంతరి ప్రశాంత్, ఉద్యోగులు పాల్గొన్నారు. మంగళవారం వేణుగోపాలస్వామి చిన్న శేష వాహనం, హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

రెండేళ్లుగా జేసీ కోర్టులో పెండింగ్

● 430 సర్వే నెంబరులోని భూ వివాదంపై ఎందుకీ జాప్యం

● పెనుమూరువాసుల ఆవేదన

పెనుమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నడి బొడ్డున ఉన్న 430 సర్వే నెంబరులో 1.5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై గత ప్రభుత్వంలోని కొందరు వైసీపీ నాయకుల కన్ను పడింది. కొందరు ఇళ్ల నిర్మాణాలకు పనులు మొదలుపెట్టారు. దీనిపై ప్రజల ఫిర్యాదు మేరకు అప్పటి డిప్యూటీ సీఎం ఆదేశాలతో జేసీ పరిశీలించి.. పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించి వెళ్లారు. అప్పటి తహసీల్దారు కూడా తమ సిబ్బందితో కలిసి నిర్మాణంలోని 85 ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి వాటిలో 75మంది అనర్హులు అని రిపోర్టు జేసీకి పంపారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఎవ్వరూ పనులు చేయరాదని రెవెన్యూ సిబ్బంది ఈ స్థలంలో బోర్డు కూడా ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా అటువైపు ఎవరూ వెళ్లలేదు. తర్వాత వైసీపీ మండలస్థాయి నాయకుల అండతో మూడో కంటికి తెలియకుండా ఓ రెవెన్యూ అధికారితో కుమ్మక్కై పొజిషన్ పట్టాలు కొందరికి ఇచ్చారు. ఇందులో ఒకే కుటుంబానికి రెండేసి, మూడేసి పట్టాలు కూడా దక్కాయి. ఈ పట్టాల కేటాయింపు సమయంలో డబ్బులు కూడా బాగానే తీసుకుని ఇచ్చారని సమాచారం. లేఅవుట్లో కాకుండా పక్కనున్న కోట్ల విలువ చేసే భూమిలో నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్కరు మూడు నుంచి ఐదుసెంట్ల వరకు ఆక్రమించుకుని నిర్మాణాలు మొదలుపెట్టారు. వీటిలోనూ బినామీ పేర్లతో ముఖ్యనేతలకే అధికారులు కట్టబెట్టారు. ప్రస్తుతం బడా నేతలు మాత్రం పనులు చేస్తున్నారు. మిగిలినవారు పనులు ఆపేశారు. దీనిపై ఎందుకు తేల్చడం లేదని ప్రస్తుత పాలకపక్ష నేతలు పలుమార్లు తహసీల్దారును అడిగితే.. జేసీ కోర్టులో ఉందని సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఈ భూ వివాదంపై ఎందుకింత జాప్యం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం: టీడీపీ



సాయమందిస్తున్న మోహన్‌మురళి, టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): మొండివెంగనపల్లె పంచాయతీ బండ మీద ఇండ్లు గ్రామంలో ఇంటిపై పిడుగుపడి ధాన్యం బస్తాలు బూడిదై.. నష్టపోయిన శ్యామల కుటుంబాన్ని ఆదుకుంటామని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్ మురళి తెలిపారు. ప్రభుత్వ విప్ థామస్ కూడా ఇదే విషయాన్ని చెప్పారన్నారు. ఆయన ఆదేశాలతో పలువురు టీడీపీ నేతలతో కలిసి బాధితులను సోమవారం రాత్రి పరామర్శించారు. నిత్యావసర సరుకులు, వస్త్రాలను అందజేశారు. అలాగే వైసీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రహ్మణ్యం కూడా రూ.10వేలు, బియ్యం, వంట సామగ్రిని పార్టీ తరపున అందజేశారు. పచ్చికాపల్లంకు చెందిన దాత ప్రసాద్ కూడా రూ.5వేలతోపాటు బియ్యం, నూనె, వంట సామగ్రిని అందజేశారు. బాధితులను ఎంపీడీవో పురుషోత్తం, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌కుమార్ పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని చెప్పారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన సంఘ నేతలు



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రాన్ని ఇస్తున్న అవుట్‌సోర్సింగ్ సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపల్, నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబును కోరారు. రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నేతలు సోమవారం విజయవాడ సీఆర్‌డీఏ కార్యాలయంలో కన్నబాబును కలిశారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న స్కిల్డ్, నాన్‌స్కిల్డ్ వేతనాలను చెల్లించాలని, రూ.21వేలు వేతనాలు తీసుకుంటున్న వారికి హెల్త్ కార్డులను మంజూరు చేయాలన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామమూర్తి, జిల్లాల అధ్యక్షులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

గంగాధరనెల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా పీ.ఎం. చంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం గంగాధరనెల్లూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండగా, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడ ఈవోపీఆర్డీగా విధుల్లో చేరిన హరిప్రసాద్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగగా, ఆయనకు రెగ్యులర్ ఎంపీడీవోగా పదోన్నతి లభించడంతో నగరి డివిజన్‌లోని విజయపురం మండలానికి బదిలీపై వెళ్లారు.

ఘనంగా మాస మహిళా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సోమవారం సత్యసాయి మాస మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థాన్‌లో మహిళా భక్తులచే వేదపఠనం, పూజలు, భజనలు నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు, మహిళా ప్రతినిధులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని ప్రసూతి వార్డులోని పురుటి బిడ్డలకు, బాలింతలకు పాలు, పండ్లు, బ్రెడ్స్, డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, శేషనారాయణ, గజేంద్రరెడ్డి, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకారకొడి పూజలు



ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవ విగ్రహాలతో నిర్వాహకులు

గంగాధరనెల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లేపల్లె గ్రామంలో మహాభారత ఉత్సవాల ప్రారంభానికి ముందుగా ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయం వద్ద శ్రీకారకొడి పూజలు అర్చకులు రమేష్ అయ్యంగార్ వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహాభారతం నిర్వాహకులు వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, గంగయ్య మండడి ఆధ్వర్యంలో ఆలయ మూలవిరాట్‌లోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల విగ్రహాలకు అభిషేకం పూజలు చేశారు. ద్రౌపదీ సమేత పాండవులు, పోతురాజు ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి పూజలు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాలను పలకల వాయిద్యాల నడుమ ట్రాక్టర్‌లో అధిష్ఠింపజేసి, నెల్లేపల్లె పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల్లో ఊరేగింపునకు తీసుకెళ్లారు. ఇంటింటి వద్ద మహిళలు కర్పూర హారతులు ఇచ్చి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మహాభారత ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు



శ్రీరంగరాజపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 49.కొత్తపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్జున తపస్సు ఘట్టం వైభవంగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్జున పాత్రధారి తపస్సు మానును ఎక్కే సందర్భంలో ఒక్కో మెట్టుకు ఒక్కో పద్యం పాడుతూ తనతో తెచ్చుకున్న జోలెలో తీసుకెళ్లిన ఫలపుష్పాలను, విభూది, నిమ్మకాయలను అన్ని వైపులా వెదజల్లాడు. వీటిని దక్కించుకోవడానికి మహిళలు పోటీపడ్డారు. ఆ తరువాత వారు తపస్మాను ఎదుట వరపడ్డారు. ఈ ఘట్టాన్ని తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త నాగరాజు, సురేష్‌బాబు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బండపల్లెలో...



చిత్తూరు కల్చరల్ (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని 11వ డివిజన్ బండపల్లెలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో సోమవారం అర్జున తపస్సుమాను పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఓం మురుగ నాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన మహాభారత నాటక ప్రదర్శనలు అలరించాయి. భక్తులకు స్థానిక ప్రజలు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో నిర్వాహక కమిటీ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీఎంఏజీవైలో జీడీనెల్లూరుకు పెద్దపీట

వెదురుకుప్పం, మే 19 (ఆంధ్ర జ్యోతి): పీఎంఏజీవై (ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన) కింద జిల్లాలోని 23 గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.46కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో జీడీనెల్లూరు నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు మండలంలో కడపగుంట, పాలసముద్రం మండలంలో పాలసముద్రం, వెంగళరాజుకుప్పం, ఎస్ఆర్‌పురం మండలంలో వెంకటాపురం, చిన్న తయ్యూరు, కార్వేటినగరం మండలంలో అన్నూరు, వెదురుకుప్పం మండలంలో బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున రూ.1.40 కోట్లు కేటాయించారు. ఈ నిధుల్లో జీడీనెల్లూరుకు పెద్దపీట వేయడం వెనుక ప్రభుత్వ విప్ థామస్ చొరవ ఉందన్న ప్రచారం ఊపందుకుంది.

ఘనంగా వజ్రాలపురం గంగ జాతరకు అంకురార్పణ



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

బంగారుపాళ్యం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మాయిపల్లె పంచాయతీ వజ్రాలపురంలో వెలసిన బోయకొండ గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం ఉదయం అర్చకులు వేదమంత్రాల నడుమ గణపతిపూజ, కలశస్థాపన, గణపతి, చండీహోమాలు నిర్వహించి, జాతరకు అంకురార్పణ చేశారు. అమ్మవారిని పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ పూజలకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాధమ్మ, క్రిష్ణప్ప, డాక్టర్ ఉషా కొమ్మినేని, చాతుర్య, పురుషోత్తం, దీప, గోపి, మమత, ఈశ్వర నాయుడులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. బొమ్మాయిపల్లె కోలాట బృందం చేసిన కోలాటం అలరించింది. ఆలయ కమిటీ మెంబర్లు నాగరాజగౌడ్, శివలింగయ్య, అట్లూరి వేణుగోపాల్, రామ్మూర్తి నాయుడు, రాజేంద్ర నాయుడు, ఎల్లప్ప, సుబ్బా నాయుడు, మురళీ, శంకరయ్య, తులసీ, భక్తులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మ జాతర

మంగళవారం ఉదయం వజ్రాలపురం గంగమ్మను ప్రత్యేకంగా అలకరించనున్నారు. అమ్మవారికి అంబళ్ళుపోసి, పొంగళ్ళు పెట్టి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 7 గంటలకు ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలి

వెదురుకుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. సోమవారం వెదురుకుప్పం మండలంలోని బ్రాహ్మణపల్లె పంచాయతీ మహేశ్వరపురంలో హౌసింగ్ ఇళ్లను తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. దిగువ బ్రాహ్మణపల్లెలో తాగునీటి ట్యాంకును పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌కుమార్, కార్యదర్శులు ప్రకాష్, మునికృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యువరాజ్ తదితరులు ఉన్నారు.

నాలుగు గ్రామాల్లో గంగమ్మ జాతర వేడుకలు

గంగాధరనెల్లూరు, మే 19 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని నాలుగు వేర్వేరు గ్రామాల్లో గంగమ్మ జాతర వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తూగుండ్రం, పిళ్ళారికుప్పం, రాణా చెక్ పోస్ట్(ఎన్‌టీఆర్ కాలనీ), కడపగుంట దళితవాడల్లో మంగళ, బుధవారం రోజుల్లో గంగమ్మ జాతరను స్థానిక ప్రజలు జరుపుకోనున్నారు.